క్లుప్తంగా

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సెమినార్

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సాంకేతిక నైపుణ్యం, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై సెమినార్ నిర్వహించారు. మారుతున్న సాంకేతికతను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం సూచించారు.

నేడు కొంతలపాడులో గ్రామ సభ

ఓర్వకల్లు: మండలంలోని ఎన్ కొంతలపాడులో శనివారం భూముల రీ సర్వేపై గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. గతంలో జరిగిన రీ సర్వేలో లోటుపాట్లను సవరణ చేసుకునేందుకు రైతుల నుంచి వినతులను స్వీకరిస్తామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి


విద్యార్థులపే ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీమంత్‌మాదన్న

కోడుమూరు రూరల్ : విద్యార్థులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని కోడుమూరు కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీమంత్‌మాదన్న సూచించారు. శుక్రవారం మండలంలోని వర్కూరు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులను శుభ్ర పరచుకోవాలన్నారు. అంతకుముందు వైద్య సిబ్బంది వర్కూరులోని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. చిన్న పిల్లల ఆరోగ్య స్థితిని పరిశీలించారు. పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, సూపర్ వైజర్ కమాల్ సాహెబ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి


డ్రమ్ములో నీటిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

కల్లూరు: ఇంటి పరిసరాలలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబు తెలిపారు. కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని నాయకల్లు గ్రామంలో శుక్రవారం జరుగుతున్న ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్ములు, గచ్చులు, తొట్లు, పాత టైర్లలో నీరు నిల్వలేకుండా చూడాలన్నారు. అలాగే ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులు, కిషోర బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి వివరాలను అప్లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో కల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శైలేష్ కుమార్, జిల్లా కమ్యూనిటీ మోబిలైజర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడుమూరు రూరల్ : విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని గూడూరు సబ్‌డివిజన్ డీఈఈ జేసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ సి.బెళగల్, లద్దగిరి ఫీడర్లలో మరమ్మతులు, 132కేవీ సబ్ స్టేషన్లలో బ్రేకర్ల మెయింటనెన్స్ చేపడుతున్నందున కోడుమూరు, గూడూరు, సి.బెళగల్ మండలాల పరిధిలో కరెంట్ కోతలు ఉంటాయన్నారు. ప్రజలు, వ్యాపారులు సహకరించాలని డీఈఈ కోరారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్‌లైన్ల నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం నగరంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు డీఈఈ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంప్స్, ఓల్డ్‌టౌన్, ఎస్టేట్ సెక్షన్ల పరిధిలోని కాలనీలలో విద్యుత్ కోతలు విధించనున్నట్లు వెల్లడించారు. అలాగే ఇళ్లు, ఇతర నిర్మాణాలు జరుగుతున్నపుడు దగ్గరలో విద్యుత్తు లైన్లు, స్తంభాలు ఉంటే విద్యుత్తు శాఖ సిబ్బందికి తెలిపి ప్రామాణిక నిబంధనల ప్రకారం తగిన దూరం పాటించి నిర్మాణాలు చేపట్టాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతాలలో...

మండల పరిధిలోని పంచలింగాల 33 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు డీఈఈ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచలింగాల, స్కంద ఫేజ్-3, గొందిపర్ల, ఈ-తాండ్రపాడు, దేవమడ గ్రామాలలో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ కోతలు విధించనున్నట్లు వెల్లడించారు.

సొంతిళ్లు... కలేనా ?

- భారంగా మారిన ఇసుక, సిమెంట్
- అందుబాటులో లేని ముడిసరుకులు
- మార్చిలోపు గృహనిర్మాణాలు పూర్తి చేసుకోవాలంటున్న అధికారులు
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు


పాణ్యంలో జగనన్న కాలనీలో నిలిచిన నిర్మాణాలు

పాణ్యం: టీడీపీ ప్రభుత్వ వ్యవహరిస్తున్న తీరుతో పేదోళ్ల సొంతింటి కల... కలగానే మిగిలేలా ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలు చాలా వరకు లబ్ధిదారులు నిర్మించుకోగా వివిధ సమస్యల మూలంగా కొన్ని ఇళ్ల పూర్తి కాలేదు. గత ప్రభుత్వంలో పాణ్యం మండలంలోని 19పంచాయతీల్లోని జగనన్న అలేవుట్లలో 601, సొంత స్థలాలు ఉన్నవారికి 728 గృహాలు మంజూరయ్యాయి. ఇందులో 720 గృహాలు పూర్తయ్యాయి. మరో 589 వివిధ దశలో ఉన్నాయి. ఈ నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. అయితే ప్రస్తుతం అధికారులు 2025 మార్చిలోపు లబ్ధిదారులు అందరూ గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోకుంటే రద్దు చేస్తామంటూ చేస్తున్న హెచ్చరికలు పేదలను ఇబ్బంది పెడుతున్నాయి. ఏదోవిధంగా ఇళ్లు నిర్మించుకుందామంటే ఇసుకు దొరకడం లేదు. అదేవిధంగా సిమెంట్, ముడి సరుకులు అందుబాటులో లేవు. ఇసుకు, సిమెంట్‌తో పాటు ముడిసరుకుల ధరలు పెరిగాయి. దీంతో పేదలు అయోమయానికి గురవుతున్నారు. టీడీపీ పెద్దలు ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రకటించిన ఉచిత ఇసుకు ఇంతవరకు ఎక్కడా అమలు కాలేదు. ప్రస్తుతం ఇసుకను టన్ను రూ. 1400పైగానే అమ్ముతున్నారు. సిమెంట్ బస్తాపై రూ. 10, స్టీల్ కేజీ 70-75 వరకు పలుకుతుంది. మూడి సరుకుల కొనలేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఇసుక సమస్యపై అధికారులను నిలదీసినా స్పందన కరువు....

ఇసుక, సిమెంట్ సమస్య పాణ్యం మండలంలో తీవ్రంగా ఉంది. పాణ్యం జగనన్న కాలనీలో 'మన ఇళ్లు-మన గౌరవం' కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించగా పేదల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత చవిచూశారు. కార్యక్రమానికి హాజరైన మండల అధికారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో జోక్యం చేసుకున్న లబ్ధిదారులు, మేస్త్రీలు ఇసుక దొరకడం లేదని నిలదీశారు. అసలు ఇసుక ఎక్కడుందో తెలియడం లేదని, బ్లాక్‌లో దొరికినా ట్రాక్టర్ రూ.7వేల పైనే చెబుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇసుకను అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారే తప్పా నేటికీ అదే పరిస్థితి నెలకొంది.

గత ప్రభుత్వంలో అందుబాటులో ముడి సరుకు

పేదవాడికి సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గృహ నిర్మాణాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చింది. లబ్ధిదారులకు బిల్లులోకి సిమెంట్, ఇసుక, ఐరన్ కడ్డీలు, మరుగుదొడ్డికి అవసరమైన సామాగ్రి, ఎలక్ట్రికల్ వస్తువులు, తలుపులు, కిటికీ సమకూర్చింది. గృహ నిర్మాణాలు వేగవంతంగా సాగాయి. జగనన్న కాలనీలు ఊళ్లనే తలపిస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సహకారంతో ఇప్పటికే పేదలు సొంతిళ్లలో జీవనం సాగిస్తున్నారు. వ్యక్తిగత సమస్యలు, ఎన్నికల కోడ్ మూలంగా గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోలేని పేదలకు ప్రస్తుతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

ముడి సరుకులు అందజేస్తాం

ప్రస్తుతం లబ్ధిదారులకు సంబంధించి కొన్ని సిమెంట్ బస్తాలు ఉన్నాయి. సిమెంట్ కోసం ప్రతిపాదనలు పంపాం. సిమెంట్, ఐరన్ కడ్డీలు ఉన్నంత వరకు లబ్ధిదారులకు అందిస్తాం. నిర్మాణాలపై సమీక్ష చేసి లబ్ధిదారులను చైతన్య పరుస్తున్నాం. ప్రభుత్వం తరుపున సంపూర్ణ సహకారం అందజేస్తున్నాం. లబ్ధిదారులు తమ గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి.
– శ్రీనివాసులు ఏఈ హౌసింగ్

సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలి


చనుగొండ్లలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ తిమ్మయ్య

కోడుమూరు రూరల్ : సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య సూచించారు. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో శుక్రవారం రాత్రి ఎస్‌ఐ తిమ్మయ్య పల్లెనిద్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ గ్రామస్తులతో సమావేశమై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్లను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజల డబ్బులను కాజేస్తున్నారని, బ్యాంక్ అధికారులు ఫోన్ల ద్వారా ప్రజల సమాచారం, ఓటీపీలు అడగరని విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచిచారు. గ్రామాల్లో ఎవ్వరైనా గుర్తు తెలియని వ్యక్తులు సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే శాంతియుతంగా పరిష్కరిస్తామని ఎస్‌ఐ గ్రామస్తులకు వివరించారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం


అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ వెంకటేష్ నాయక్


తహసీల్దార్ ఆంజనేయులకు అర్జీలు ఇస్తున్న రైతులు

కోడుమూరు రూరల్ : రీసర్వేలో భాగంగా వచ్చిన భూసమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ అన్నారు. రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో నెలకొన్న భూసమస్యల పరిష్కారం కోసం శుక్రవారం అమడగుంట్లలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్ గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో మొత్తం 45మంది రైతులు వివిధ రకాల భూ సమస్యలపై అర్జీలిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వరలక్ష్మి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ క్రిష్ణమూర్తి, మండల సర్వేయర్ సునీల్, వీఆర్వోలు మధుసూదన్, నారాయణ, ఎల్లప్ప, శేఖన్న, సురేష్, సర్వేయర్లు వేణుగోపాల్, మాదన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు వర్కూరులో

రీసర్వేలో నెలకొన్న భూసమస్యల పరిష్కారం కోసం శనివారం మండలంలోని వర్కూరులో గ్రామ సభ నిర్వహిస్తున్నామని తహసీల్దార్ వెంకటేష్ నాయక్ తెలిపారు. రైతులు తమ భూ సమస్యలపై అర్జీలిస్తే పరిశీలించి పరిష్కార చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దిగువపాడులో గ్రామసభ

కర్నూలు రూరల్ : మండల పరిధిలోని దిగువపాడు గ్రామంలో శుక్రవారం అధికారులు గ్రామ సభ నిర్వహించారు. భూ సమస్యలకు సంబంధించి 28 దరఖాస్తులు వచ్చాయని కర్నూలు రురల్ తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సూధకర్, వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్‌లు పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి

కల్లూరు: గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు సూచించారు. శుక్రవారం కల్లూరు అర్బన్ పందిపాడులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ రీ సర్వే వలన భూముల హెచ్చు తగ్గులు, ఉమ్మడి ఎల్‌పీఎమ్ తదితర సమస్యలపై రైతులు అర్జీలు సమర్పిస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేస్తున్న దృశ్యం

కల్లూరు: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బస్తిపాడు గ్రామ పంచాయతీ మజరా చిన్నకొట్టాల గ్రామంలో రోడ్ల నిర్మాణానికి ప్రజాప్రతినిధులతో కలిసి ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి భూమి పూజ చేశారు.కార్యక్రమంలో ఈఓఆర్డి నాగేష్, ఏపీ ఫైనాన్స్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రామాంజనేయులు, మాజీ ఎంపీటీసీ లక్ష్మన్న, మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌లకు శిక్షణ

కల్లూరు: మండలంలోని ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో శుక్రవారం గ్రామీణ అంశాలపై ఎంపీడీఓ నాగేశాచలరెడ్డి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డి నాగేష్, ఏపీఓ మద్దేశ్వరమ్మ, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో క్రీడలు అవసరం


వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి

కర్నూలు (టౌన్): ఒత్తిడితో కూడిన చదువుల నుంచి ఉపశమనం పొందాలంటే విద్యార్థినీ, విద్యార్థులు క్రీడల్లో పాల్గొనాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి సూచించారు. శుక్రవారం స్థానిక టౌన్ మోడల్ కళాశాల క్రీడా ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14, అండర్-17 విభాగాల్లో బాల బాలికలకు వాలీబాల్, ఆర్చరీ క్రీడా పోటీలు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి హాజరై పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చాటితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శామ్యూల్ పాల్, కర్నూలు అర్బన్ ఎంఈఓ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకట శేషాద్రి, డీఈఓ ఆఫీస్ ఏడీ శామ్యూల్ పాల్ తనిఖీ చేశారు. దామోదరం సంజీవయ్య మున్సిపల్ హైస్కూల్, ప్రైమరీ స్కూల్, ఏపీజే అబ్దుల్ కలాం మోమెరియల్ మున్సిపల్ హైస్కూల్, ఉర్దూ హైస్కూల్(బాలికలు), ప్రభుత్వ ఉన్నత పాఠశాల (టౌన్ మోడల్)లను వారు ఆకస్మికంగా తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజన నాణ్యత, శుభ్రత, తాగునీటి సదుపాయాన్ని పరిశీలించి, వంట ఏజెన్సీ వారితో, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయా స్కూళ్లలోని విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. మధాహ్న భోజన పథకంలో గుర్తించిన లోపాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకళతామన్నారు.

మహిళా కార్మికులకు లైసెన్సులు ఇవ్వాలి


మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నిర్మల

కర్నూలు (అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో మహిళా హమాలీ కార్మికులకు లైసెన్సులు ఇవ్వాలని శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి పి.నిర్మల, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ కోరారు. ఈ మేరకు శుక్రవారం కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మిని కలసి వినతిపత్రం సమర్పించారు. మార్కెట్‌లో మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను సెక్రటరీ దృష్టికి తెచ్చారు. మహిళా హమాలీ కార్మికులు ఏళ్ల తరబడి పనిచేస్తున్నా ఎలాంటి గుర్తింపు లేదని పేర్కొన్నారు. వారు చనిపోతే ఎలాంటి నష్టపరిహారం అందడం లేదని, మార్కెట్‌లో మహిళా కార్మికులు పనిచేస్తున్నట్లుగా లైసెన్స్‌లు జారీ చేయాలని సూచించారు. మహిళలకు మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని, నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి మార్కెట్ కమిటీ సెక్రటరీ జయలక్ష్మి సానుకూలంగా స్పందించారు. సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సాయిబాబా, మార్కెట్ యార్డు యూనియన్ల గౌరవాధ్యక్షుడు రాముడు, సీపీఎం ఓల్డ్‌సిటీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచులకు శిక్షణ


కార్యక్రమంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు (రూరల్) : కర్నూలు మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో శుక్రవారం ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు పంచాయతీల నిర్వహణపై ఎంపీడీఓ రఘునాథ్ శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి ఉప సర్పంచుల బాధ్యతలు, గ్రామాల అభివృద్ధి, నిధుల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సీ.క్యాంపు రైతుబజారు తనిఖీ


రైతుబజారులో ఉల్లి ధరపై ఆరా తీస్తున్న జేడీ రామాంజనేయులు

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు సీ.క్యాంపు రైతుబజారును మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు తనిఖీ చేశారు. కూరగాయలను బోర్డు రేటుకే విక్రయిస్తున్నారా అని ఆరా తీశారు. శుభ్రతను పరిశీలించారు. త్వరలో చేపట్టబోయే విస్తరణ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ.. సీ.క్యాంపు రైతుబజారును త్వరలోనే మరింత విస్తరించి ఎక్కువ మంది రైతులకు అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య పనులపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఏడీఎం నారాయణమూర్తి, ఎస్టేటు అధికారి హరీష్‌కుమార్, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ పాల్గొన్నారు.

టెండర్ దాఖలు గడువు పొడిగింపు

కర్నూలు(హస్పిటల్):కర్నూలు మెడికల్ కాలేజీ ఆధ్వర్యంలో కలర్ డాప్లర్, 2డీ ఎకో కార్డియోగ్రఫీ మిషన్ కొనుగోలుకు పిలిచిన టెండర్ దాఖలు గడువు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాయింట్ కలెక్టర్, డీపీసీ ఆదేశాల మేరకు గడువును ఈ నెల 26వ తేదీ వరకు పొడిగించామన్నారు. వివరాలను కళాశాల వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (టౌన్): మున్సిపల్ కార్మికుల సమ స్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప విన్నవించారు. శుక్రవారం స్థానిక నగర పాలక కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పనిముట్లు, పుష్‌కాట్ బండ్లు, ఎన్నికల భత్యం, సమ్మె కాలపు వేతనం, ఔట్‌సోర్సింగ్ కార్మికుల కు యూనిఫాంఇప్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న రెండు సంవత్సరాల స్టిచ్చింగ్ చార్జీలు ఇవ్వాలని, రెగ్యులర్ కార్మికులకు యూనిఫాం, కొబ్బరినూనె, సబ్బులు, చెప్పులు ఇవ్వాలని కోరారు.

జీవాల పెంపకంపై అవగాహన కల్పించండి

కర్నూలు(అగ్రికల్చర్): జీవాల పెంపకాన్ని శాస్త్రీయంగా చేపట్టేలా అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా ప్రత్యేక అధికారి, డైరెక్టరేట్ జేడీ మాధవరావు అన్నారు. శుక్రవారం కొండారెడ్డిబురుజు సమీపంలోని పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో జిల్లాలోని పశువైద్యులు, సహాయ సంచాలకులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పశుసంవర్ధక శాఖ చేపడుతున్న అన్ని రకాల కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుతం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు తాపే కార్యక్రమం జరుగుతుందని, దీనిని విజయవంతం చేయాలని సూచించారు. పశువులు, గొర్రెలు-మేకలు, కోళ్ల షెడ్లకు వచ్చిన ధరఖాస్తులపై విచారణ జరిపి అర్హులను గుర్తించాలని సూచించారు. పశువులకు వ్యాపించే సీజనల్ వ్యాధులపై కూడా అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జేడీ జి.శ్రీనివాస్, డీడీలు దుర్గాప్రసన్నబాబు, హేమంత్‌కుమార్, రాజశేఖర్, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా కల్లూరు మండలం పర్లలో వెటర్నరీ డాక్టర్‌గా పనిచేస్తూ పదోన్నతిపై బదిలీ అయిన వెంకటసుబ్బయ్యను సత్కరించారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

- జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య

ఓర్వకల్లు: గతంలో జరిగిన రీసర్వే మూలంగా ఇబ్బందులు ఉన్న రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య సూచించారు. శుక్రవారం మండలంలోని తిప్పాయపల్లె గ్రామంలో రీ సర్వే సమస్యలపై గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభకు జేసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ నవ్య మాట్లాడుతూ గతలో చేసిన రీ సర్వే ఇబ్బందులను పరిష్కరిస్తామన్నారు. రైతుల నుంచి వినతులను స్వీకరించి, సదరు భూములను మరోసారి సర్వే చేయిస్తామన్నారు. విస్తీర్ణంలో తేడాలు, కొలతల్లో వ్యత్యాసాలు, అన్నదమ్ముల మధ్య తగాదాలు వంటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో మొత్తం 53 వినతులు స్వీకరించినట్లు తహసీల్దార్ విద్యాసాగర్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు క్రిష్ణవేణి, మండల సర్వేయర్ శంకర్‌మాణిక్యం, రీ సర్వే డీటీ శర్మిల, విఆర్‌ఓ జనార్ధన్, స్థానిక నాయకులు హరినాథ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి


ఏఈ మధుసూదన్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి గఫూర్ మియ్యా డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ తీరును నిరసిస్తూ శుక్రవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్‌మియ్యా మాట్లాడుతూ ఎన్నికల ముందు సీఎం చంద్రబాబు ప్రజలపై భారాలు తగ్గించి అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చి నేడు అన్ని రకాల రేట్లు పెంచుతూ ప్రజలను దారుణంగా మోసం చేస్తున్నారని విమర్శించారు. పింఛన్ మినహా సూపర్ సిక్స్ పథకాలను సీఎం విస్మరించారన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మళ్లీ కరెంట్ చార్జీలను పెంచి కూటమి ప్రభుత్వం పేదలకు అన్యాయం చేస్తుందన్నారు. విద్యుత్ చార్జీలు తగ్గించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలోనాయకులు లక్ష్మన్న, వీరన్న, బుడ్డప్ప, శేఖర్, వెంకటేష్, శంకర్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆస్తులను పరిరక్షించుకోవాలి


గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీపీఓ భాస్కర్

ఓర్వకల్లు: గ్రామ పంచాయతీ పరిధిలోని ఆస్తులను పరిరక్షించుకోవాలని డీపీఓ భాస్కర్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఎంపీపీ తిప్పన్న అధ్యక్షతన జరిగిన మొదటి రోజు శిక్షణా కార్యక్రమాన్ని డీపీఓ ప్రారంభించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రైవేట్ లేఅవుట్, బిల్డింగ్ ప్లాన్ నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, రిసోర్స్ పర్సన్లు మురళీ, జయపరిమళ, ఎన్ఐఆర్డీ కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, వివిధ గ్రామాల ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సహకరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ఉసేన్‌బీ

పాణ్యం: ఆదాయ వనరులు పెంచి పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ ఉసేన్‌బీ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అందుబాటులోని వనరులను ఉపయోగించుకుని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు పాటుపడాలన్నారు. గ్రామీణులకు సురక్షిత మంచినీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓఆర్డీ చంద్రమౌళేశ్వర్‌గౌడ్, మండల ఇంజినీర్ మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి పాటల పోటీలు

కర్నూలు కల్చరల్: భారత్ వికాస్ పరిషత్ తుంగభద్ర, హంద్రీ బ్రాంచ్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించారు. శుక్రవారం స్థానిక విజయదుర్గ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. క్విజ్ పోటీల్లో విద్యానగర్ మాంటిస్సోరి పాఠశాల, దేశభక్తి గీతాల పోటీల్లో కేశవ మెమోరియాల్ పాఠశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరికి ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎమ్.వి.ఎస్.ఎస్.ఎన్ ప్రసాద్, విజయదుర్గ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్యనారాయణ బహుమతులు, జ్ఞాపికలను అందజేశారు. బీవీపీ తుంగభద్ర తిరుపతి ప్రాంత అధ్యక్షుడు, కర్నూలు శాఖ అధ్యక్షుడు లక్ష్మణ స్వామి, కార్యదర్శి మురళీకృష్ణ, కోశాధికారి గుండ సతీష్, బీవీపీ హంద్రీ శాఖ అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి బుస్సా శ్రీనివాసులు, కోశాధికారి కోదండ రామయ్య పాల్గొన్నారు.